క్లుప్తంగా

చెక్‌పోస్ట్ తనిఖీ



ఏన్కూరు: చెక్‌పోస్ట్ వద్ద సూచనలు చేస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్

ఏన్కూరు/ముదిగొండ: ఏన్కూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, ముదిగొండలోని వల్లభిలో అంతరాష్ట్ర చెక్‌పోస్టును అడిషనల్ డీసీపీ కేఆర్‌కే ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్ట్ వద్ద అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను నిత్యం తనిఖీ చేయాలన్నారు. మద్యం, నగదు రవాణాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వైరా ఏసీపీ రెహమాన్, ఎస్సై బాదావత్ రవి, ఖమ్మం సీఐ రాజిరెడ్డి, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లండన్ ప్రతినిధులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విదేశీ విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.వీరన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో లండన్‌కు చెందిన యూనిక్లాడ్ డైరెక్టర్ నగేష్, మేనేజర్లు ప్రశాంత్, నవ్యలు మాట్లాడుతూ.. విదేశాలలో విద్య, ఉపాధి అవకాశాలు పొందడానికి కావాల్సిన కెరియర్ కౌన్సిలింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డి.బంగారి, అధ్యాపకులు శ్రీధర్, మాధవి, సారంగపాణి, శ్రీనివాస్, వీరారెడ్డి, మధు, చెన్నారావు, శ్రీకాంత్, రాజ్‌కుమార్, ప్రభావతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నాగులవంచలో అమృత కలశ యాత్ర



నాగులవంచలో అమృత కలశ యాత్రను నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కేడెట్లు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో మేరీ మిట్టీ – మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కేడెట్లు శుక్రవారం అమృత కలశ యాత్రను నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శనను నిర్వహించి కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

వైరా: నిరుపేద విద్యార్థి ఉన్నత విద్యకు కావాల్సిన సాయాన్ని పరిశ సీతారత్నం ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య చేయూత నందించారు. వైరాకు చెందిన తెలగారపు రామకృష్ణ అనే విద్యార్థి ఎంపీసీ విద్యనభ్యసిస్తుండగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మధ్యలో మానేశాడు. విషయం తెలుసుకున్న పరిశ సీతారత్నం ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లో కూడా చదువులకు సాయం అందిస్తానని తెలిపారు. వైరా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ, హెచ్‌ఎంలు మాధవరావు, సీహెచ్ మల్లేశ్వరి, అధ్యాపకులు వీరభద్రం, సురేష్, ఉమారాణి, బాబూరావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, మధు, రోషన్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైరా డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ గంగిశెట్టి అనిత కుమార్తె హేమన్యశ్రీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు పెనుగొండ ఉపేందర్, చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు నరసింహారావు, విజయ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

పెనుబల్లి: అభయాలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన మేడా కృష్ణయ్య శుక్రవారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా వారు అంగీకరించారు. దీంతో ఖమ్మం నేత్ర నిధి టెక్నీషియన్ మందా నాగేశ్వరరావు మృతుడు మేడా కృష్ణయ్య నేత్రాల నుండి కార్నియాలను సేకరించి ఖమ్మం నేత్ర నిధికి అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు మేడా రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు సాంబశివరావు, వేముల నరసింహారావు, మేడా మోహన్‌రావు, టెక్నీషియన్ మందా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలగానే 'కాటన్ పార్క్'

- పార్క్ స్థలంలో ప్రైవేట్ వ్యాపారుల తిష్ట
- ఫ్యాక్టరీల వ్యర్థాలతో కాలుష్యం
- పచ్చని పొలాలకు తీవ్ర నష్టం
- పత్తి రైతులకు తప్పని దళారుల బెడద



తల్లాడలో సాగు చేసిన పత్తి పైరు



కాటన్ పార్క్ నిర్మాణం కోసం సేకరించిన స్థలంలో ఏర్పాటైన ప్రైవేట్ పరిశ్రమలు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో కాటన్ పార్క్ ఏర్పాటు కలగానే మిగిలింది. తెల్లబంగారం(పత్తి) అత్యధికంగా పండించే ప్రాంతంగా ఖమ్మం జిల్లా తల్లాడ పరిసర ప్రాంతానికి పేరుంది.

42 ఎకరాల భూమి సేకరణ..

అన్నారుగూడెం రెవెన్యూ పరిధిలో కొత్తగూడెం వెళ్లే రోడ్డులో 2006లో (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి 42 ఎకరాల భూమి సేకరించింది. అప్పట్లో రైతులకు ఇష్టం లేకపోయినా వారికి నచ్చజెప్పి ఎకరానికి లక్ష రూపాయలు ఇచ్చి భూమిని సేకరించింది. జిల్లాలో ఎక్కువగా పత్తి పండించే తల్లాడ, ఏన్కూరు, జులూరుపాడు మండలాలకు చేరువలో ఉన్న అన్నారుగూడెంలో కాటన్ పార్క్ ఏర్పాటు చేయాలనే తలంపుతో స్థల సేకరణ చేసినా అది వెనక్కి పోయింది. కాటన్ పార్క్‌తో పాటు టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు చేస్తామని అప్పటి కేంద్ర మంత్రి రేణుకా చౌదరి హామీ ఇవ్వటంతో రైతులంతా ముందుకు వచ్చి భూములిచ్చారు. కానీ కాటన్ పార్క్, జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయకపోగా.. దాని గురించి పట్టించుకున్న నాథుడే లేడు.

కెమికల్ ఫ్యాక్టరీలతో.. తగ్గిన భూసారం

2013 డిసెంబరులో అమ్మోనియా, బ్రోమైడ్, పొటాషియం బ్రోమైడ్ అనే రసాయనాలు తయారు చేసే స్పైకా కెమికల్ ఇండస్ట్రియల్ నిర్మాణం జరిగింది. అప్పటి వరకు పచ్చని పొలాలతో పాడి సంపదలతో కళకళలాడే నాలుగు గ్రామాలు కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు పంట పొలాల్లో కలిసి భూసారం తగ్గి, విషతుల్యంగా తయారవుతున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు, రైతులు కాలుష్య నియంత్రణ బోర్డుకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా వరుణ్‌లేబరేటరీ ఆధ్వర్యంలో ప్రభుత్వ అనుమతితో మరో అతి ప్రమాదకరమైన రెడ్‌జోన్ బల్క్ డ్రగ్ కెమికల్స్ ఫ్యాక్టరీని నిర్మించింది. దీంతో అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావుపేట, బాలప్పేట గ్రామాల ప్రజలు, యువకులు ఫ్యాక్టరీకీ వ్యతిరేకంగా ఆందోళన చేశారు. అయినా ఫ్యాక్టరీ నిర్మాణం ఆగలేదు. దీంతో పరిసర పంట పొలాలు విషపూరితంగా తయారై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రైవేట్‌కు దారాదత్తం..

అన్నారుగూడెంలో ఏర్పాటు చేస్తామని చెప్పిన కాటన్ పార్క్ కాస్త ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్క్‌గా మారింది. రూ.40 లక్షల వ్యయంతో 2014లో ఇండస్ట్రియల్ పార్క్‌లో రోడ్లు కూడా నిర్మించారు. తాము మంచి ఉద్దేశంతో భూములిస్తే ప్రైవేట్ పరిశ్రములకు దారా దత్తం చేయటమేంటని ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 4,209 ఎకరాల్లో పత్తి పైరు సాగు చేశారు. ప్రస్తుతం ప్రత్తి పైరు పూత, కాయ దశలో ఉంది. మరో పది రోజుల్లో కాయ పగిలి మొదటి తీతలు ప్రారంభమౌతాయి. పత్తి రైతులు దళారులకే పత్తిని అమ్ముకోవాల్సి వస్తోంది. జిన్నింగ్ మిల్ ఏర్పాటు కాక ప్రవేట్ వ్యాపారులకు అడిగిన రేటుకి ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కాటన్ పార్క్, జిన్నింగ్ మిల్లును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



తల్లాడలోని ప్రైవేట్ పత్తి కౌంటర్ (ఫైల్)

రైతులకు నష్టం చేశారు..



ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కాటన్ పార్క్ పేరుతో భూములు సేకరించి ఆ తర్వాత దాని ఉద్దేశం మర్చి పోయింది. కాటన్ పార్క్ ఏర్పాటు కాకపోవటంతో ఈ ప్రాంతంలో పడించిన పత్తిని రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా కాటన్ పార్క్, జిన్నింగ్ మిల్లును ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

– ఆపతి వెంకటరామారావు, అన్నారుగూడెం

భూములిచ్చినా ఉపయోగం లేదు..



కాటన్ పార్క్ ఏర్పాటు చేస్తామని రైతుల వద్ద నుంచి భూములు సేకరించారు. కాటన్ పార్క్‌లో టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య తీరుతుందని చెప్పారు. కనీసం కాటన్ పార్క్ కూడా ఏర్పాటు చేయకపోవటంతో ఈ ప్రాంతంలో పత్తి పండించే రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

– నీలంరాము, రైతు, అన్నారుగూడెం

12 ఎకరాలు ఇచ్చాం..



అప్పట్లో ప్రభుత్వం కాటన్ పార్క్ ఏర్పాటు కోసం 12 ఎకరాలు భూమిని ఇచ్చాం. భూమి ఇచ్చిన తర్వాత ప్రభుత్వం కాటన్ పార్క్ ఏర్పాటు చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు ఆ భూములను లీజుకిచ్చింది. ప్రైవేట్ వ్యక్తులకిచ్చినా భూముల్లో ఎవరికి తోచిన రీతిలో వాళ్లు రైతులకు హాని కలిగించే ఫ్యాక్టరీలు సైతం ఏర్పాటు చేశారు.

– నీలం జానకి రామారావు, రైతు, అన్నారుగూడెం

అభివృద్ధిని చూసి ఆదరించండి



లక్ష్మీపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, నాయకులు

తల్లాడ: సత్తుపల్లి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అంబేడ్కర్ నగర్, మల్సూర్ తండా, రంగంబంజర, లక్ష్మీపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమంతో వెల్లి విరిసిందన్నారు. దళితబంధు గురించి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారం నమ్మొద్దన్నారు. నియోజకవర్గంలోని అందరికీ దళితబంధు వచ్చేలా తాను కృషి చేస్తానన్నారు. అంబేడ్కర్ నగర్ సర్పంచ్ కిరణ్, గ్రామస్తులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.

1న కల్లూరులో సీఎం బహిరంగ సభ..

నవంబరు 1న కల్లూరులోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. కల్లూరు బహిరంగ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ప్రజల ఆశీస్సులతో సీఎంగా కేసీఆర్ మూడో సారి గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైరా ఎఎంసీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, తల్లాడ సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ వెంకట్‌లాల్, లక్ష్మీపురం సర్పంచ్ సీతారామిరెడ్డి, అంబేడ్కర్‌నగర్ సర్పంచ్ కిరణ్, కోటిరెడ్డి, బాబు, కేతినేని చలపతిరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, బానోత్ మోహన్, వరపర్ల ఉదయ్, మువ్వా మురళి, కోదూరి వీరకృష్ణ, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, డి.నరేష్‌రాజు, శీలం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్ చక్రవర్తి



చింతకాని: మాట్లాడుతున్న ఆర్డీఓ గణేష్



ముదిగొండ: మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

వేంసూరు/సత్తుపల్లిటౌన్/తల్లాడ/కల్లూరురూరల్/ముదిగొండ/చింతకాని: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆర్డీఓలు గణేష్, అశోక్ చక్రవర్తి, తహసీల్దార్లు రమేష్, రవికుమార్, ఎంపి రాజు, పులి సాంబశివుడు, రామారావులు తెలిపారు. శుక్రవారం వేంసూరు, తల్లాడ, కల్లూరురూరల్, చింతకాని రైతు వేదికల్లో, సత్తుపల్లి తహసీల్‌లో, ముదిగొండలోని స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో.. పంచాయతీ కార్యదర్శులకు, బీఎల్‌ఓలకు సీ-విజిల్ యాప్, ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లాడ మండలంలో 44,959 ఓట్లు ఉన్నాయని, కొత్త ఓట్లు 1,500కు పైగా ఉంటాయని తెలిపారు. కోడ్ అమల్లో ఉన్నందున పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలు, వాల్ రైటింగ్స్ ఉండకూడదన్నారు. ప్రతి ఒక్కరూ సీవిజిల్ యాప్ ఉపయోగించాలని సూచించారు. ఎక్కడైన ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఫొటోలు, వీడియో, ఆడియో ఆధారంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా ఈ నెల 31 వరకు ఓటరు నమోదు అవకాశం ఉన్నందున గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల ముందు పోలింగ్ చీటీలను ఓటర్లకు నేరుగా అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, రమేష్, రవికుమార్, అశోక్, ఏఓ తాజుద్దీన్, రామ్మోహన్, ఆర్ చిరంజీవి, ఏపీఎం శ్రీనివాసరావు, సూర్యనారాయణ, ఏఈలు అశోక్, సింధు, ఎన్ఎస్పీ డీఈ శ్రీనివాసరావు, ఎస్సై రఘు, ఏఎస్సై జేవీఆర్, ఎలక్షన్ డీటీ శివకుమార్, డీటీలు సుధీర్, బాబ్జిప్రసాద్, ఆర్ఐలు నరేష్, జానిమియ, అన్వర్, స్టాలిన్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఎన్నికల సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి



పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, నాయకులు

ముదిగొండ: బీఆర్ఎస్ పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. ముదిగొండ మండలంలో వెంకటాపురం, సీతారాంపురం, కట్టకూరు గ్రామాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి శుక్రవారం రాత్రి పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలు పార్టీల నుంచి 80 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మధిరలో ఈ సారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీలో కలిసి కట్టుగా పనిచేసి కార్యకర్తల బలోపేతానికి, పార్టీకి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎర్ర వెంకన్న, బంకా మల్లయ్య, సీతారామయ్య, వెంకట్‌గౌడ్, ధర్మారావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం



మాట్లాడుతున్న బానోత్ మదన్‌లాల్

వైరా: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. శుక్రవారం వైరా పరుచూరి గార్డెన్స్‌లో బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి అధ్యక్షతన బీఆర్ఎస్ వైరా పట్టణ, మండల బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, జెడ్పీటీసీ సభ్యురాలు కనకదుర్గ, చల్లగుండ్ల నాగేశ్వరరావు మాదినేని సునీత, కట్టా కృష్ణార్జునరావు, కాపా మురళీ కృష్ణ, పసుపులేటి మోహనరావు, రామారావు, నాగేశ్వరరావు, రామారావు, భద్రయ్య, డాక్టర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మధిర: చిన్నారులకు అన్ని రకాల టీకాలు వేయించాలని మాటూరు పేట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. శుక్రవారం మాటూరుపేట పీహెచ్‌సీలో చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ వ్యాధి నిరోధక టీకాల చార్ట్ ప్రకారం చిన్నారులకు అన్ని టీకాలు వేయించాలన్నారు. మిషన్ ఇంద్రధనస్సు టీకాల కార్యక్రమంలో భాగంగా గతంలో 7 అనారోగ్యాలు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని, ప్రస్తుతం 11 పెద్ద అనారోగ్యాలు రాకుండా శిశువులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ టీకాలు ప్రైవేట్ ఆస్పత్రిలో ఎక్కువ రేటు ఉంటుందని, ప్రభుత్వం ద్వారా ఈ టీకాలను ఉచితంగా పొందవచ్చునని సూచించారు. పిల్లల్లో కంటికి సంబంధించిన సమస్యలు రాకుండా విటమిన్ ఏ సిరప్ ఐదు సంవత్సరాల వరకు, సంవత్సరం వయస్సు నుంచి ప్రతి 6 నెలలకు ఒకసారి మొత్తం తొమ్మిది సార్లు ఈ సిరప్ తాగించాలని కోరారు. మీ దగ్గరలోని ఆశ కార్యకర్తలను లేదా వైద్య సిబ్బందిని గాని సంప్రదించాలని తెలిపారు.

రోడ్డుపైనే మురుగునీరు





రోడ్డుపై మురుగు నీరు నిలిచిన దృశ్యం

కొణిజర్ల: వైరా మున్సిపాలిటీ శివారు గ్రామం మండల పరిధిలోని పల్లిపాడు 18వ వార్డులో కొంత మంది మురుగు నీరు రోడ్డుపైకే వదులుతుండటంతో పలు కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారు. 18వ వార్డులో ఇటీవల అభివృద్ధి పనుల నిమిత్తం రోడ్డుకు ఓ వైపు సైడ్ డ్రైయిన్ నిర్మాణం చేపట్టి.. మరో వైపు డ్రెయిన్ లేకపోవడంతో పలువురు తమ ఇళ్లలోని నీటిని రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా ఉండడమే కాకుండా.. దుర్వాసన వెదజల్లుతుంది. ఈ విషయమై వార్డు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయిందని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మురుగునీరు రోడ్డుపై నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై వార్డు కౌన్సిలర్ వేణును వివరణ కోరగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.

కేసు నమోదు

వేంసూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్న 74 మందిని పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం తహసీల్దార్ ఎంపి రాజు ఎదుట హాజరు పరుచగా సొంత పూచికత్తుపై బైండోవర్ కేసు నమోదు చేశారు. బైండోవర్ తరువాత మద్యం విక్రయాలు చేపడితే రూ.లక్ష ఫైన్‌తో పాటు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వైరారూరల్: పేకాట స్థావరాలపై శుక్రవారం వైరా ఎస్సై మేడా ప్రసాద్ ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని కేజీ సిరిపురం గ్రామ శివారులో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.4,200 నగదును స్వాధీన పర్చుకోని పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేశారు.

సాగర్ జలాలు విడుదల

కల్లూరురూరల్: మండలంలో 32 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్ వరి పంటవేశారు. పంటలకు నీరు లేక ఎండిపోతున్న తరుణంలో అధికారులు సాగర్‌నీరు విడుదల చేశారు. శుక్రవారం మధిర బ్రాంచ్ కెనాల్‌కు 585 క్యూసెక్కుల నీరు చేరాయి. 22.75కిలోమీటర్ వరకు మరో రెండు రోజులు పట్టె అవసరం ఉందని భావిస్తున్నారు. 850 క్యుసెక్కుల నీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు వృధాగాపోకుండా జలవనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గడప గడపకు కాంగ్రెస్



గ్యారంటీ కార్డులతో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

తల్లాడ: మండలంలోని గోపాలపేట గ్రామంలో శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డులను ప్రతి ఇంటికీ అందించారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కటికి కిరణ్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు తాళ్ల వెంకటేశ్వర్లు, తాటి నరసింహారావు, షేక్ జమాల్, కాటయ్య, ప్రభాకర్‌రావు, దావీదు, మహేష్, యేసు, రాంబాబు, ఫ్రాన్సిస్, సామేలు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న తపాలా కార్యాలయ ఏఐజీడీఎస్‌యూ సిబ్బంది

పెనుబల్లి: తపాలా సంస్థలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవకుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా ఆర్గనైజర్ కార్యదర్శి తెలంగాణా సర్కిల్ సెక్రటరీ బండి జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లి బ్రాంచ్ పరిధిలోని పెనుబల్లి ఉప తపాల కార్యాలయంలో ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవ యూనియన్ ద్వైవార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ సేవకులు ఈ నెల 4న చేపట్టిన సమ్మెతోనే.. సంస్థకు ఎంతో నష్టం వాటిల్లిందని, సమస్యను పరిష్కరించకపోతే సమ్మెబాట పట్టవలసి వస్తుందన్నారు. అనంతరం ఏఐజీడీఎస్‌యూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జె.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, సెక్రటరీగా ప్రసాద్, ట్రెజరర్‌గా మహేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు పట్టాభిరామయ్య, సెక్రటరీ షేక్ మౌలాలి, కొత్తగూడెం బ్రాంచ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఇల్లందు బ్రాంచ్ సెక్రటరీ సుభాష్, రాయల పుల్లయ్య, కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు తపాల కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు వీరబాబు, వెంకట్‌లాల్

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలో శుక్రవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విరోచనాలు, కీళ్లనొప్పులు, గ్యాస్ ట్రబుల్, జ్వరం, జలుబు, దగ్గు, షుగర్, బీపీ వ్యాధులతో బాధపడుతున్న 93 మంది రోగులకు డాక్టర్ వీరబాబు, డాక్టర్ వెంకట్‌లాల్ వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు బనిగండ్లపాడు పీహెచ్‌సీ వస్తే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు ఇస్తామన్నారు. వ్యాధుల బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం జయలక్ష్మి, జెడ్పీటీసీ శీలం కవిత, ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, హెచ్‌ఈఓ సదాశివరావు, హెల్త్ అసిస్టెంట్ దొడ్డా అశోక్, ఏఎన్ఎం రాణి, ఫార్మాసిస్టు శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

సాగునీరు అందించాలి



సింగరేణి అధికారులకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సత్తుపల్లిటౌన్: పంటలకు సాగునీరు అందించాలని శుక్రవారం సర్పంచ్ జక్కుల ప్రభాకర్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులు సింగరేణి అధికారులకు విన్నవించారు. దీంతో పీఓ వెంకటాచారి స్పందించి.. సత్తుపల్లి జీవీఆర్‌ఓసీ నుంచి ప్రతి ఏటా రేజర్ల గ్రామంలోని 100 ఎకరాలకు.. రెండు పంటలు పండించుకునేందుకు సాగునీరు అందిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని జీఎం సాలెం రాజు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గోపాలరావు, వెంకన్న, వెంకటేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీను, గురుమూర్తి, శ్రీనివాస్, శివన్నారాయణ, గాంధీ ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బోనకల్: బతుకమ్మలతో విద్యార్థినులు

బోనకల్/సత్తుపలిటౌన్: బోనకల్ మండలంలోని తూటికుంట్ల గ్రామంలో గల చైతన్య విద్యాలయంలో, సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడిగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఉస్సేన్ మాట్లాడుతూ.. కుల మత బేదాలు లేకుండా అందరు సమానంగా బతుకమ్మ వేడుకలను జరుపుకోవాలన్నారు. ఐకమత్యానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.